క్లుప్తంగా

సైన్స్‌ల్యాబ్‌ల పరిశీలన



సైన్స్‌ల్యాబ్‌లను పరిశీలిస్తున్న జూనియర్ కాలేజీ విద్యార్థులు

ఆకివీడు: సైన్స్‌ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కూల్ టూ ల్యాబ్ రెండు రోజుల కార్యక్రమం గురువారం ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి రోజు జూనియర్ కళాశాలల విద్యార్థులకు సైన్స్‌ల్యాబ్‌ల పట్ల అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో భౌతిక, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ అనిల్ విజయ్, డాక్టర్ ఇందిర, అధ్యాపకులు డాక్టర్ టి.ఓగేశ్వరరావు, కె.శామ్యూల్, జి.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ మట్టి తొలగించేదెప్పుడో?



ఉండిలో రోడ్డుపైనే డ్రైయినేజీ మట్టి

ఉండి: మూడు రోజుల నుంచి డ్రైయినేజీలో నుంచి తీసిన సిల్టును అలానే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉండి పెదపేటలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా తొలగించిన డ్రైయినేజీ మట్టిని అలాగే వదిలిపెట్టడంతో ఓ పక్క దుర్గంధం, మరోవైపు దోమలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి మట్టిని తొలగించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి పూజలు



నిమ్మనపేట రామాలయం వద్ద సామూహిక వరలక్ష్మి పూజలు చేస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని నిమ్మనపేట రామాలయంలో మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని గురువారం నల్లా కిరణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసంలో ఇలాంటి పూజలు, అభిషేకాలు చేయడం ద్వారా గ్రామం, ప్రాంతం, కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, కరిమెరక శ్రీనివాస్, ఖండాపు శ్రీనివాసరావు, అలగిరి సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.

చదువే బాలికల భవిష్యత్‌కు ఆయుధం



శిక్షణలో కార్యక్రమంలో మాట్లాడుతున్న సుజాతరాణి

ఉండి: భవిష్యత్‌ను బంగారంగా మార్చుకునేందుకు బాలికలకు చదువే ఆయుధమని ఏపీడీ సుజాతరాణి అన్నారు. గురువారం ఉండి ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర వికాసం మండలస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాతరాణి మాట్లాడుతూ కిశోర బాలికల వికాశానికి కుటుంబం బాలికలతో కలిసిమెలిసి ఉండాలన్నారు. తల్లిదండ్రులు బాలికలతో తప్పకుండా మంచి చెడు మాట్లాడుతూ వారి అవసరాలు గుర్తించి తీర్చాలని సూచించారు. చట్టాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పోక్సో చట్టం, అక్రమరవాణా వంటి వాటిపైనా బాలికలు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమానికి సీడీపీఓ వాణి విజయరత్నం, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.మేరి, పి.బాలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

కాళ్ల: మండలంలోని పెదఅమిరంలో ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఇర్రింకి జయరామకృష్ణ అనే వ్యక్తి వద్ద నుండి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై ఆకివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని వివరించారు. ఈ దాడుల్లో ఎస్సై ఎల్.రమాదేవి, శ్రీనివాసరావు, సురేష్ రాజు, వైసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: స్థానికంగా ఎక్సైజ్ పోలీసులు డ్రై డే సందర్భంగా నిర్వహించిన ఆకస్మిక దాడులో గురువారం కె.గోపి అనే వ్యక్తి వద్ద 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు.

కోట్లలో ఆదాయం.. నిర్వహణ దయనీయం



భీమవరం మున్సిపాలిటీలో తుప్పు పట్టి దెబ్బతిన్న బీరువాలు



కాలం చెల్లిన కుర్చీలు, బెంచిలు



కంప్యూటర్లు లేని రెవెన్యూ సెక్షన్

- ఇది భీమవరం మున్సిపాలిటీ దుస్థితి
- కాలం చెల్లిన బీరువాల్లోనే రికార్డులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీలో 30 ఏళ్ల నాటి పాత ఫర్నిచర్‌తో మున్సిపల్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోనే అధిక ఆదాయం కలిగిన గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా ఉన్న భీమవరం మున్సిపాలిటీలో సరైన సౌకర్యాలు లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తూప్పుపట్టిన బీరువాలనే ఉద్యోగులు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. దాంతో రికార్డుల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాలం చెల్లిన ఫర్నిచర్‌తో స్థానంలో కొత్త ఫర్నిచర్ ఒకటి కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. భీమవరం మున్సిపాలిటీకి కోట్లు ఆదాయం వస్తున్న మున్సిపాలిటీలో వసతుల కొరత వేధిస్తుంది. పట్టణానికి ఎంతమంది కమిషనర్లు మారుతున్నారే కాని పాత వస్తువులతో ఉద్యోగుల పడుతున్న ఇబ్బందులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఉద్యోగులకు నూతన ఫర్నిచర్, సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ ఉద్యోగుల నాయకులు కూడా మాట్లాడం లేదు. దాంతో చేసేది లేక, అడిగే ధైర్యం లేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతూనే పనిచేసుకుంటున్నారు. భీమవరం పట్టణాన్ని సుందరీకరణ చేయాలని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తరుచూ సమీక్షలు చేస్తున్నారు. పట్టణ సుందరీకరణ తర్వాత ముందు మున్సిపాలిటీల్లో సుందరీకరణ చేయడంపై జాయింట్ కలెక్టర్ దృష్టి పెట్టాలి. మున్సిపాలిటీ మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని 33/11కె వి విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో 11 కె వి గునుపూడి ఫీడర్ పై చెట్లు కొమ్మలు తొలగించడానికి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్ వెంకటేశ్వరరావు గురువారం చెప్పారు. పట్టణంలోని చినరంగానిపాలెం, మారుతీ నగర్, కలెక్టరేట్ ఆవరణ, బొక్కావారిపాలెం, రాజులపేట, కముజువారిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండల పరిధిలో కొత్త 11 కేవీ ఇండస్ట్రియల్ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని కోపల్లె, వేంపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రక్తదానం కోసం ఉద్యమిద్దాం

భీమవరం (ప్రకాశంచౌక్): వినూత్న, మార్గదర్శక ప్రయత్నంలో జిల్లాలో రక్తదాన శిబిరాలు ఎక్కువగా నిర్వహించి రక్తాన్ని సేకరించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజల నుంచి స్వచ్ఛందంగా రక్తాన్ని సేకరించేందుకు ప్రతి ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతి 15 రోజులకు ఒక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది ముందుకు రావాలన్నారు. ఆపద, అత్యవసర సమయంలో ఉన్న రోగులకు అందించి వారి ప్రాణాలను కాపాడవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రక్తదానం శస్త్రచికిత్సలకు, ప్రమాద బాధితులు, క్యాన్సర్ రోగులు, తలసేమియా, రక్తహీనత వంటి వైద్యం పొందుతున్న బాధితుల జీవితాలను కాపాడుతుందన్నారు. మీ సహకారం, ఎంత చిన్నదైనా, చాలా మంది జీవితాల్లో గణనీయమైన మార్పును కలిగిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్వచ్ఛంద రక్తదానానికి పశ్చిమగోదావరి జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి కృషి చేద్దామని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ఆ ప్రకటనలో తెలిపారు.

షష్ఠి ఉత్సవాలకు సిద్ధం



ఆనాల చెరువు వద్ద నూతనంగా నిర్మించినసుబ్రహ్మణ్య స్వామి ఆలయం



షష్ఠి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లు



తోలేరులో వల్లిదేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వీరవాసరం: మండలంలోని పలు దేవాలయాలు షష్ఠి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వల్లి దేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలకు తోలేరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా తయారైంది. చలువ పందిళ్లు, విద్యుత్ దీప అలంకరణతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. 6వ తేదీ ఉదయం 6 గంటలకు అంకురార్పణ స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలుగా చేయడం ప్రత్యేక పూజలు హోమాలు అనంతరం రాత్రి 6 గంటలకు శ్రీ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి సిద్ధం చేశారు. 7వ తేదీ ఉదయం నాలుగు గంటలకు స్వామి వాళ్లకు ప్రత్యేక ప్రత్యేక అభిషేకాలు 9 గంటల నుంచి తీర్థం ప్రారంభం 10 గంటలకు అక్కడ అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామని నిర్వాహకులు చవ్వాకుల సత్యనారాయణమూర్తి తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు మేళ తాళాలతో బాణసంచా కాల్పుల మధ్య స్వామి వార్ల గ్రామోత్సవం అత్యంత కనుల పండువగా నిర్వహిస్తామని వివరించారు. రాయకుదురు, కొణితివాడ, తోకలపూడి, మత్స్యపురి, నడపన వారి పాలెం తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాల్లోనూ షష్ఠి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

నేటి నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద 250 ఏళ్ల క్రితం వెలసిన వల్లీ దేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐదు రోజుల పాటు జరిగే షష్ఠి కార్యక్రమంలో మొదటి రోజు సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం, రెండవ రోజు స్వామి వారికి విశేష అభిషేకాలు, అఖండ అన్నసమారాధన, మూడవ రోజు వేలాయుధ పూజ, వసంతోత్సవం, కోట్నాళ్లు, నాలుగో రోజు గ్రామోత్సవం, ఐదవ రోజు మంగళవారం స్వామికి కావిడి ఉత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధికమిటీ చైర్మన్ నేరెళ్ల రామకృష్ణ చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఉత్సవ విగ్రహాల అందజేత

ఆకివీడు: పురాతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం అనంతరం ఉత్సవ విగ్రహాల్ని అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు గురువారం నూతన ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు రామకృష్ణకు అందజేశారు. రూ. 1,11,000ల విలువైన పంచలోహంతో తయారు చేసిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కనుమూరు అబ్బాయిరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణ, మన్నే పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో సూత్రాస్ వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్ ప్రారంభం



భీమవరంలో సూత్రాస్ వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్‌లో మహిళల సందడి

భీమవరం: పట్టణంలోని ఆనంద్-ఇన్‌లో సూత్రాస్ వెడ్డింగ్ స్పెషల్ ఎగ్జిబిషన్ 2024 గురువారం ప్రారంభమైంది. రెండు రోజులు పాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో భారతీయ వివాహాల కళాత్మకత, సంప్రదాయాన్ని ప్రతిబింబించే చేతితో తయారు చేసిన లెహంగాలు, క్లిష్టమైన చీరలు, టైమ్‌లెస్ షేర్వాణీలు, స్టేట్‌మెంట్ ముక్కలు అందుబాటులో ఉంటాయని నిర్వహకులు చెప్పారు. అలాగే మెహందీ నుంచి గ్రాండ్ రిసెప్షన్ వరకు అన్ని వేడుకలకు అనువైన ఉపకరణాలతోపాటు ఒరిజినల్ గోల్డ్ అండ్ డైమండ్స్, చేనేత ఇల్లు, వార్డ్‌రోబ్, శ్రీదా చీరలు, వివాన్ క్రియేషన్స్, శ్రీ మారుతి కలెక్షన్స్ , టిక్నో డార్జి రిషబ్ కలెక్షన్, శ్రీ అలేఖ్యా జ్యువెలరీ, మహాలక్ష్మి జ్యువెలర్స్ వంటివన్నీ అందుబాటులో ఉంటాయని చెప్పారు.

క్యాన్సర్ రోగికి సాయం అందజేత

ఉండి: మండలంలోని చెరుకువాడ కాపులపేటకు చెందిన మాన్యం శివలక్ష్మి అనే క్యాన్సర్ రోగికి మానవత సేవా సంస్థ ప్రతినిధులు నిత్యావసర సరకులు, ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతూ ఏ సహాయం లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకుని ఆమెకు సాయమందించినట్టు సంస్థ మండల కో-చైర్మన్ డి.రామలింగేశ్వరరావు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

వీరవాసరం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందజేయడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ముందు వరుసలో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వీరవాసరం మండలం కొణితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని , సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పీహెచ్‌సీని సందర్శించిన సందర్భంగా ఓపి విభాగం, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డు, పురుషుల వార్డు, ఇంజక్షన్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఇంజక్షన్ రూమ్ నందు ఉన్న గర్భిణితో మాట్లాడుతూ బలమైన పౌష్టికాహారం తీసుకుంటే శిశువు మెదడు బాగా ఎదుగుతుందని, తెలివైన పిల్లలు పుడతారని అన్నారు. ఈ సందర్భంలో మెడికల్ అధికారితో మాట్లాడుతూ గర్భిణులు, ప్రసూతి మహిళలలో రక్తహీనత లేకుండా తరచూ పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేయాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఎన్ని టీబి కేసులు ఉన్నాయి, కుష్టు వ్యాధి రోగులు ఎంతమంది ఉన్నారు వారికి క్రమం తప్పకుండా మందులను అందజేస్తున్నారా అని ఆరా తీశారు. క్యాన్సర్ సర్వే ఎంతవరకు వచ్చింది, 10 సంవత్సరాలు, 16 సంవత్సరాలు బాలికలకు టిడి వ్యాక్సినేషన్ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ పీహెచ్‌సీ నందు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి పేద, మధ్యతరగతి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా తెలిపారు. ఎంతో మంది పేదలు అనారోగ్యాలు కారణంగా ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి అప్పులు పాలు అవుతున్నారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొణితివాడ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన సందర్భంలో అన్ని గదులను, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. స్లాబ్‌కు పెచ్చులు ఊడిన చోట చేసిన మరమ్మతుల పటిష్టతపై జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ ప్రాంగణంలో కొంతమేర దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బాలికలతో మాట్లాడుతూ బాగా అందరూ బాగా చదువుకోవాలన్నారు. వసతి గృహం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, వీరవాసరం తహసీల్దార్ ఏవి రామాంజనేయులు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు.నవనీత్, వసతి గృహ సంక్షేమ అధికారి కె.జ్యోతి, ఎఎస్ డబ్ల్యూ ఓ భాను మణి, ఆర్.ఐ రూజ్ వెల్ట్, తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



కాళ్ల: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి



ఉండి: ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

కాళ్లలో.. కాళ్ల: ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం కాళ్ల మండలంలో ప్రశాంతంగా సాగింది. జేసీ రాహుల్ కుమార్ రెడ్డి పోలింగ్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలక్షన్ కమీషను సూచించిన సమయానికి ఎప్పటికప్పుడు పోలింగు శాతాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.అలాగే పెదఅమీరం గ్రామంలోని క్యాన్సర్ హాస్పిటల్ దగ్గరలో ఉన్న ప్రభుత్వ పోరంబోకు స్థలాలను జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. వీటికి సంబంధించిన మ్యాపులను పరిశీలించి, అధికారులు నుంచి కొన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ జి.సుందరసింగ్, ఎంపీడీఓ డా.జి.స్వాతి, సర్వేయరు ప్రవీణ్ ఉన్నారు.

ఉండిలో..

ఉండి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉండి మండలానికి గానూ 91 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సూపర్‌వైజర్, తహసీల్దార్ కె.నాగార్జున తెలిపారు. గురువారం ఉండి జెడ్పీ హైస్కూల్ పోలింగ్‌బూత్ నంబర్ 103లో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 69 ఓట్లు వుండగా వాటిలో 63 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని భీమవరం ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎస్.రవీంద్ర ఉన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: మండలంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్‌లో 92 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 90 మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 82 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 53, స్త్రీ ఓటర్లు 29 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్ ఎన్. వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొని ఓటర్లకు అన్ని ఏర్పాట్లు చేశారు మండలంలోని యూటీఎఫ్, ఎస్టీయూ యూనియన్లు ప్రత్యేక టెంట్లు వేసి ఉపాధ్యాయ ఓటర్లకు స్లిప్‌లు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెన్మత్స విజయ రామరాజు పోలింగ్ విధానాన్ని పరిశీలించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల తీరును భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పాలకోడేరు లోని పోలింగ్ బూత్ నెంబర్ 107ను గురువారం పరిశీలించి పోలింగ్ తీరుపై సంతప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బూత్‌లో మొత్తం102 ఓట్లు ఉండగా 99 ఓట్లు పోలయ్యాయని, పురుషులు 71 మంది, స్త్రీలు 28 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఓటింగ్ 97 శాతం నమోదైందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.భారతి విజయలక్ష్మి ఉన్నారు.

ఉత్సాహంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగు కేంద్రాన్ని జాయింటు కలెక్టరు టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం స్థానిక ఎస్‌హెచ్‌బిఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో రూమ్ నెంబరు 07లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. హెల్ప్ డెస్క్, వైద్య శిబిరాన్ని పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి. ఇంకా ఎన్ని ఓట్లు ఉన్నాయని జిల్లా జాయింటు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. పురుషులు ఓట్లు 434, మహిళల ఓట్లు 325 మొత్తం 759 ఓట్లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లతో సజావుగా జరుగుతుందని తెలిపారు. ఓట్లు ఎక్కువ ఉన్న పోలింగు స్టేషన్లో త్వరితగతిన తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పేదల ఇళ్ల నిర్మాణం

పెనుమంట్ర: పేదల ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం పెనుమంట్ర మండలం పొలమూరు లే-అవుట్లను ఆమె పరిశీలించి, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని గృహాలు పూర్తయ్యాయి? గృహప్రవేశాలు జరిగాయని, మిగిలిన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి నిరుపేద కుటుంబాలకు అందించి, వారితో గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జ్ పీడీ జి.పిచ్చయ్యను జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. పెనుమంట్ర భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన 109 పోలింగ్ కేంద్రాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం నిధులు కొరతతో నిర్మాణం నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు.

న్యాయసేవా కార్యకర్తల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సేవా దృక్పథంతో న్యాయసేవా కార్యకర్తలుగా పనిచేసే ఆసక్తి ఉన్న ఔత్సాహికుల నుంచి శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి కనీస విద్యార్హత, ఎలాంటి ధనార్జన ఆశించకుండా ఉండేవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, లా విద్యార్థులు, వైద్యులు, డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, రాజకీయేతర సభ్యులు దరాఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల వారు ఈ నెల 11వతేదీలోపు నరసాపురం కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.